


జిల్లా అధ్యక్షులెవరు?



- ఎటూ తేల్చని కాంగ్రెస్, బీజేపీ
- తర్జనభర్జన పడుతున్న అధిష్ఠానాలు
- నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ తమ జిల్లా శాఖ అధ్యక్షులెవరో తేల్చడంలో తర్జనభర్జన పడుతున్నాయి. రోజులు గడిచినా కొద్ది ఈ వ్యవహారం జటిలమవుతూ ఆ పార్టీల రాష్ట్ర నేతలకు తలనొప్పి కలిగిస్తున్నది. కాంగ్రెస్‌లో ఆశావహుల సంఖ్య పెరిగిపోతుంటే బీజేపీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అనుచరవర్గంలోనే పోటీ నెల కొంది. దీంతో ఎవరిని ఎంపిక చేయాలో తేల్చుకోలేకపోతున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులెవర వుతున్నారో తెలియక ఆయా పార్టీల శ్రేణుల్లో గందర గోళ పరిస్థితి నెలకొంటున్నది. జిల్లా పార్టీ అధ్యక్షుల నియామకం తర్వాత తమకు పార్టీ పదవులు దక్కుతాయనుకుంటున్న వారి ఆశలు రోజురోజుకు నీరుగారి పోతున్నాయి.

● కాంగ్రెస్‌లో పోటాపోటీ

అధికార కాంగ్రెస్ పార్టీలో జాతీయ నాయకత్వం క్షేత్ర స్థాయిలో పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. పార్టీ జిల్లా అధ్యక్షులే ఇక ముందు అన్ని వ్యవహారాల్లో కీలక పాత్ర వహిస్తారని పేర్కొన్నది. దీంతో జిల్లా అధ్యక్ష పదవికి పోటీ పెరిగింది. అధికార పదవుల్లో ఉన్నవారు సైతం పార్టీ కార్యాలయానికి రావాలని, పార్టీ నాయకత్వంతో సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని అధిష్ఠానం చెప్పడంతో జిల్లా అధ్యక్ష పదవులు ఇప్పుడు ఆ పార్టీలో కీలకమయ్యాయి. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా మానకొండూర్ శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ వ్యవహరిస్తు న్నారు. ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడిని నియమిం చాలని పార్టీ భావిస్తున్నది. అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారిలో చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలి చాల రాజేందర్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రస్తుత జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అంజన్‌కుమార్, నగర మాజీ అధ్య క్షుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి, హాస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున రాజేందర్ పోటీ పడుతున్నారు.

● బీజేపీలో బండి సంజయ్ ఆశీస్సులు ఎవరికో..?

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆశీస్సులు ఉన్న వారికే బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి దక్కుతుంది. ఆయన ఎవరి పేరు సూచిస్తే వారు అధ్యక్షుడిగా నియమితులు కావడం ఖాయం. అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారిలో ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి బోయినపల్లి ప్రవీణ్‌రావు, సీనియర్ నాయకుడు కొట్టె మురళీకృష్ణ, నగర శాఖ మాజీ అధ్యక్షుడు బేతి మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు. మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ, సీనియర్ నాయకుడు కన్నబోయిన ఓదెలు కూడా అధ్యక్ష పదవిని ఆశించారు. వయోపరిమితి కారణంగా వీరిద్దరి పేర్లు రేసు నుంచి తప్పించారు. గంగాడి కృష్ణారెడ్డి మొదటి సారి జిల్లా అధ్యక్ష పదవిని చేపట్టినప్పుడు పూర్తి కాలం పదవిని నిర్వహించలేదు. ఆ తర్వాత రెండో సారి అధ్యక్ష పదవి వరించింది. రెండు సార్లు అధ్యక్ష పదవిలో ఉన్న వారికి ఆ పదవి మళ్లీ ఇచ్చేది లేదని పార్టీ నిబంధన ఉన్నది. తను మొదటి విడతలో పూర్తి కాలం పదవిలో లేనందువల్ల తనను మళ్లీ అధ్యక్షుడిగా నియమించాలని ఆయన కోరుతున్నట్లు సమాచారం. బేతి మహేందర్‌రెడ్డి మినహా మిగతా అందరూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు విధేయ వర్గంలోనే ఉన్నారు. ఆయన జిల్లా అధ్యక్ష పదవికి క్రిష్ణారెడ్డి పేరు సూచించారని, రెండు విడతల పదవీ కాలం అనే నిబంధన అడ్డు వస్తున్నట్లు చెబుతున్నారు. పోటీలో ఉన్న కొట్టె మురళీకృష్ణ, బోయినపల్లి ప్రవీణ్‌రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ముగ్గురు మంత్రి సంజయ్‌కి సన్నిహితులే కావడంతో ఎవరి పేరు చెప్పినా మిగతా ఇద్దరు నొచ్చుకుంటారనే భావనతో ఆయన ఎటు తేల్చుకోలేక పోతున్నారని ప్రచారం జరుగుతున్నది. బేతి మహేందర్‌రెడ్డి బండి సంజయ్ వర్గానికి చెందిన వారే అయినా ఆయన ఎంపీగా ఎన్నికైన తర్వాత రాజకీయంగా తీసుకున్న చర్యలతో ఇద్దరి మధ్య దూరం పెరిగింది. ఆ కారణంగానే మహేందర్‌రెడ్డి అధ్యక్ష పదవి పొందలేక పోతున్నారని చెబుతున్నారు. పార్టీలోని ఇతర విభాగాల సీనియర్ నేతలతోపాటు ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలతో కలిసి మహేందర్ తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారని, వారందరి సూచన మేరకు కేంద్ర మంత్రి సంజయ్‌ని కలిసి అధ్యక్ష పదవిని ఇవ్వాలని కోరారని సమాచారం. ఆయనకు పదవి రావడమనేది అంత సులువు కాదని అంటున్నారు. గంగాడి కృష్ణారెడ్డికి అధ్యక్ష పదవి రాని పక్షంలో మురళీకృష్ణ, ప్రవీణ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్‌లో ఒకరికి అవకాశం దక్కుతుంది.

● మంత్రుల నిర్ణయమే కీలకం

ఉమ్మడి జిల్లా పరిధి నుంచి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ రాష్ట్ర మంత్రి వర్గంలో మంత్రులుగా ఉండడంతో వీరి నిర్ణయం, మద్దతు అధ్యక్ష పదవి ఎంపికలో కీలకం కానున్నది. ఈ ఇద్దరు మంత్రులు ఉత్తర, దక్షిణ ధృవాలుగా ఉంటూ ఎవరి దారి వారిదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. దీంతో ఏకాభిప్రాయం సాధ్యం కాక అధ్యక్షుని ఎంపిక ఆలస్యం అవుతున్నదని ప్రచారం జరుగుతున్నది. పదవిని ఆశిస్తున్న వారిలో ఈ ఇద్దరు నేతలు తమకు విధేయులు ఎవరన్న విషయానికే ప్రాధాన్యం ఇస్తుండడంతో ఒకరు సూచించే అభ్యర్థి మరొకరికి నచ్చని పరిస్థితి ఏర్పడింది. ఆశావహులు కూడా రెండు వర్గాలుగా చీలిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా అధ్యక్షుడి ఎంపిక ఆ పార్టీ అధిష్ఠానానికి చిక్కుముడిగా మారింది.

మహాత్ములు చూపిన బాటలో పయనించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గణేష్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మహనీయులు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం లైబ్రరీ ఆడిటోరియంలో మహనీయుల జయంత్యుత్సవాల సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ప్రాధాన్యంతోనే దేశంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. మహాత్మాపూలే మహిళల హక్కులు, విద్య కోసం పోరాటం చేశారన్నారు. అంబేద్కర్ దేశాభివృద్ధికి, బాబు జగ్జీవన్‌రామ్ దేశ ప్రజలకు సౌకర్యాలు అందే విధంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్, గంగాధర ఎంపీడీవో దాముని రాము, బుర్ర మధుసూదన్‌రెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, డాక్టర్ హరికాంత్, పద్మావతి, ఉమేరా తస్లీమ్, సరసిజ, ఆచార్య సూరేపల్లి సుజాత, జయంతి, అబ్రరూల్‌బకి, ఆచార్య వరప్రసాద్, రంగప్రసాద్, శ్రీవాణి, మునావర్, జోసఫ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



ఎల్‌ఎండీ సీఎస్ఐ చర్చిలో చిన్నారుల ప్రదర్శన

తిమ్మాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రైస్తవులు ఆదివారం భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం జరుపుకున్నారు. వచ్చే ఆదివారం ఈస్టర్‌కు ముందు ఆదివారాన్ని యేసు యెరూషలేముకు వచ్చారని చెప్పేందుకు గుర్తుగా మట్టల ఆదివారం(పామ్ సండే)గా క్రైస్తవులు జరుపుకుంటారు. ఎల్‌ఎండీ కాలనీలో గల సిఎస్ఐ ఆల్ సెయింట్ చర్చిలో జరిగిన మట్టల ఆదివారం వేడుకల్లో బాగంగా క్రైస్తవులు అందరు కలిసి చేతిలో మట్టలను పట్టుకొని చర్చి చూట్టు దేవుని గీతాలను ఆలపిస్తూ తిరిగారు. ఈ సందర్భంగా చర్చి పాస్టరేట్ చైర్మన్ రెడ్డిమల్ల ప్రసాద్ పామ్ సండే గురించి తమ సందేశాన్ని అందించారు. సండే స్కూల్ పిల్లలు ప్రత్యేక గీతాలు, నాటికలకను ప్రదర్శించారు.



చెట్ల మధ్య శిథిలమవుతున్న పైపులైను, ఓహెచ్ఆర్ ట్యాంకులు

ప్రజాధనం నీళ్ల పాలు

- మిషన్ భగీరథ రాకతో రెండు ప్రాజెక్టులను పట్టించుకోని అధికారులు
- తుప్పు పడుతున్న మోటార్లు

5

కాట్రపల్లిలో ఎలుగుబంటి హల్‌చల్

- యువకుడిపై దాడి

4

మామిడి పంటకు తెగుళ్లు

- వరుసగా నాల్గవ యేడు నష్టం
- సమస్యల్లో రైతులు

4

చేపలను రక్షించుకునేందుకు మత్స్యకారుల పాట్లు

- అడుగంటుతున్న చెరువులు
- రైతుల వద్ద నీరు కొని పైపుల ద్వారా చెరువులోకి వదులుతున్న వైనం



వెన్నంపల్లి గై చెరువులోకి మోటార్ ద్వారా వదులుతున్న నీరు

సైదాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి): వేసవి ఎండలు అధికంగా కొట్టడంతో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి చెరువులు, కుంటల్లో నీరు అడుగంటి పోతున్నాయి. చెరువులో నీరు వేడెక్కి చేపలు ఉక్కిరి బిక్కిరి అవుతు న్నాయి. మత్స్యకారులు రైతుల వ్యవసాయ బావుల నుంచి నీరు కొని చెరువుల్లో వదులు తున్నా రు. చెరువులలో నీరు తగినంత లేకపోతే చేపలు చనిపోయే అవకాశముందని, ముందు జాగ్రత్తగా ప్రైవేటు వ్యక్తుల బావుల వద్ద నీరు కొని చెరువుల్లో వుదులు తున్నామని మత్స్యకారులు తెలుపుతు న్నారు. సైదాపూర్ మండలంలో చాలా మంది మత్స్య కారులు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తుంటారు. సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు చాలా లోతుకు వెళ్లి పోవడంతో చెరువులు, కుంటలు తొందరగానే అడు గంటి పోయాయి. కాలువ నీళ్ల వచ్చినప్పుడు వాటితో చెరువులు, కుంటలు నింపితే బాగుండేదని మత్స్యకారులు అంటున్నారు. చెరువులు, కుంటలు నింపడం వల్ల చేపలు, భూగర్భ జలాలు పెరిగేవని తెలుపుతున్నారు.

18 నుంచి హాకీ టోర్నమెంట్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 18, 19న 5 ఎ సైడ్ ఓపెన్ ఆహ్వానిత హాకీ టోర్నమెంట్ నిర్వహించను న్నట్లు హాకీ సంఘం జిల్లా అఫీషియేటింగ్ కార్యదర్శి మహమ్మద్ తారిక్ అలీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను జిల్లా హాకీ సంఘం సౌజన్యంతో హమీద్ 11 హాకీ, ఫిట్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామ న్నారు. జిల్లాలోని క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. క్రీడాకారులందరికి ఉద యం, సాయంత్రం భోజనం ఏర్పాటు చేస్తా మని, విజేతలకు బహుమతులు ప్రదా నం చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 15 లోగా 7075667465 నంబర్ లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



బైక్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అణగారిన వర్గాల్లో వెలుగులు నింపారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబేద్కర్ స్టేడియం నుంచి అంబద్కేర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అవమానించిందన్నారు. దేశ వ్యాప్తంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేస్తున్నామన్నారు. అంబేద్కర్ చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. 1951లో హిందూ కోడ్ బిల్లు, సామాజిక న్యాయ సాధికారత అంశాలపై అంబేద్కర్ అభిప్రాయాలను నెహ్రూ వ్యతిరేకిస్తే మనస్తాపానికి గురై న్యాయ శాఖ పదవికి రాజీనామా చేశారన్నారు. 1952 ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసి, 1954 ఉప ఎన్నికల్లో స్వయంగా అభ్యర్థిని పెట్టి అంబేద్కర్‌ను ఓడించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అన్నారు. అంబేద్కర్ అంత్యక్రియలు ఢిల్లీలో జరగనీయకుండా ముంబాయికి తరలిస్తే విమాన ఛార్జీలను చెల్లించాల్సిందిగా అంబేద్కర్ భార్యకు రసీదు పంపిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తున్న ప్రభుత్వం నరేంద్ర మోదీదే అన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న బండి సంజయ్‌కుమార్

● నగరంలో భారీ బైక్‌ర్యాలీ

అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలో అంబేద్కర్ స్టేడియం నుంచి కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వరకు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కేంద్ర హోంశాఖసహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్వయంగా బైక్‌నడుపుతూ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అంబేద్కర్ స్టేడియం నుంచి కోతిరాంపూర్, కమాన్‌చౌరస్తా, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, గీతా భవన్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ మీదుగా కోర్టు చౌరస్తాకు చేరుకు న్నారు. జైభీమ్, జైబీజేపీ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు.

● మోదీ పాలనను మరవొద్దు...

కరీంనగర్ రూరల్: మోదీ పాలనను మరవొద్దని, బీజేపీని వీడొద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలను కోరారు. ఆదివారం కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో బీజేపి చేపట్టిన గావ్ చలో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికులతో సమావేశమై కేంద్ర పథకాల అమలు, గ్రామ సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చే బియ్యంలో కేంద్రం 37 రూపాయలు ఖర్చు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం 10 రూపాయలు మాత్రమే ఖర్చు చేస్తోందన్నారు. ఈ మాత్రం ఖర్చు చేసి తామే సన్న బియ్యం ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా రని ఎద్దేవా చేశారు. రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుతోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ పాల్గొన్నారు.

చంద్రరథంపై సీతారాములు



రథంపై కొలువుదీరిన స్వామివారు



స్వామివారిని పల్లకిలో తీసుకొస్తున్న అర్చకులు

ఇల్లందకుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులను అర్చకులు చంద్రరథంపై అధిరోహించారు. సాయంత్రం నిత్యవిధి హోమం, రథబలి అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను, చంద్రరథాన్ని ఘనంగా అలంకరించారు. అనంతరం స్వామివారి ఉత్సమూర్తులను పల్లకిలో ఉంచి చంద్రరథంపైకి తీసుకొచ్చారు. రాత్రి 10:30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, ఈవో కందుల సుధాకర్ ఏర్పాట్లు చేశారు.





స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

నాటారు.. నరుకుతున్నారు..



ఈదుల గట్టెపల్లి-అన్నారం గ్రామాల మధ్య నరికివేసిన చెట్లు

మానకొండూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలను నాటింది. ఉపాధి హామీ పథకం, అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. వర్షాకాలంలో మొక్కలను రహదారులు, కాల్వగట్లు, పొలాల గట్లు, పాఠశాలలు, ఆలయాలు, చెరువుల గట్లపై కోట్లాది రూపాయలను వెచ్చించి నాటారు. ఈదులగట్టెపల్లి-అన్నారం, మానకొండూర్-రాఘవాపూర్, లలితాపూర్-పచ్చునూర్, వెల్ది-లింగాపూర్ గ్రామాల్లో రోడ్డు పక్కన నాటిన వివిధ రకాల మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. చెట్లు విద్యుత్ లైన్ల కింద ఉండడంతో కొమ్మలు వైర్లకు తగిలి సరఫరాకు తరుచూ అంతరాయం కలుగుతోంది. దీంతో విద్యుత్ సిబ్బంది ఆ చెట్లను నరికివేస్తున్నారు. విద్యుత్ లైను కింద మొక్కలు నాటడం, అవి పెద్దవి కావడంతో నరకడం తరుచుగా జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యుత్‌లైన్ల క్రింద మొక్కలు నాటకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హైవోల్టేజీతో కాలిపోయిన గృహోపకరణాలు

● సుమారు రూ.2 లక్షల నష్టం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండు ప్రాంతంలో శనివారం రాత్రి హైవోల్టేజీ విద్యుత్‌సరఫరా కావడంతో ఇళ్లలోని గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు 20మంది ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ఇతర పరికరాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. ఒక్కసారిగా భారీ శబ్ధం రావడం వల్ల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రాత్రంతా కరెంటు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లేకపోవడం వల్ల చీకట్లో కాలం వెళ్లదీయాల్సి వచ్చిందని బాధితులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ట్రాక్టర్ దొంగల పట్టివేత

మంథని, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపాక గ్రామంలో ట్రాక్టర్ దొంగతనం చేసిన కేసులో ఇదే గ్రామానికి చెందిన ముప్పిడి రమేష్ అలియాస్ రవి, గంగాపురి గ్రామానికి చెందిన దాకమూరి ప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేష్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా వాటిని తీర్చుకోవటానికి ట్రాక్టర్‌ను దొంగిలించి ట్రాక్టర్ మెకానిక్‌గా చేస్తున్న ప్రసాద్ ద్వారా అమ్ముకోవటానికి ప్రయత్నించగా తాము పట్టుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను, సామగ్రిని స్వాధీన పరుచకొని, వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

గోదావరిపై బ్యారేజీ నిర్మాణాలు జరిగేనా?

- జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం చిన్నకొల్వాయి.. కమ్మునూరులో నిర్మాణాలకు ప్రణాళిక
- 3 టీఎంసీల సామర్థ్యంతో రెండు బ్యారేజీల నిర్మాణాలకు కసరత్తు
- సుమారు రూ.వెయ్యి కోట్ల నిధులతో అంచనా
- పెండింగ్‌లో ప్రభుత్వ నిర్ణయం



జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం చిన్నకొల్వాయి వద్ద గోదావరి నది

జగిత్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో గోదావరి నదిపై బ్యారేజీ నిర్మాణాలు జరిగేనా అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా మీదుగా వెళ్తున్న గోదావరి నదిపై బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయి, కమ్మునూరు ప్రాంతాల్లో రెండు బ్యారేజీల నిర్మాణాలకు గతంలో కసరత్తులు జరిగాయి. నీటి పారుదల శాఖ అధికారులు గత యేడాది నవంబరు, డిసెంబరు మాసాల్లో క్షేత్ర స్థాయిలో ప్రాథమిక సర్వే నిర్వహించారు. సుమారు 3 టీఎంసీల సామర్థ్యంతో రెండు బ్యారేజీలను రూ.వెయ్యి కోట్ల నిధులతో నిర్మించాలని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. సంబంధిత సర్వే నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించారు. చిన్న కొల్వాయి, కమ్మునూరు ప్రాంతాల్లో గోదావరి నదిపై ఒక్కొక్కటి మూడు టీఎంసీల సామర్థ్యంతో రెండు బ్యారేజీలను నిర్మించినట్లయితే ఈ ప్రాంతంలో సాగు, తాగు నీటి ఇక్కట్లను శాశ్వతంగా నివారించవచ్చని, పలు ప్రాంతాల్లో పనిచేయని ఎత్తిపోతల పథకాలను సైతం పునరుద్ధరించవచ్చని అభిప్రాయపడ్డారు. జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, బీర్‌పూర్, సారంగాపూర్, ధర్మపురి, వెల్గటూరు తదితర ప్రాంతాలు గోదావరి పక్కనే ఉన్నా సాగు నీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి బ్యారేజీల నిర్మాణాలు అవసరమని గుర్తించారు. గతంలోనూ జగిత్యాల జిల్లాకు సాగు నీరు అందించేందుకు ఇరిగేషన్ నిపుణులు హనుమంతరావు ల్యాడర్ సిస్టం ప్రపోజల్స్‌ను అప్పటి ప్రభుత్వానికి నివేదించినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఈ ప్రపోజల్స్ ప్రకారం గోదావరి నదిపై బ్యారేజీలు నిర్మించి వాటిపై లిఫ్టులు ఏర్పాటు చేసి నీటిని వినియోగించుకోవాలని సూచించి నట్లు అంటున్నారు. ఇదే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి నాలుగు నెలల క్రితం అప్పటి ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి తీసుకవెళ్లారు. బీర్ పూర్ మండలం కమ్మనూరు, చిన్న కొల్వాయి ప్రాంతాల్లో గోదావరి నదిపై బ్యారేజీలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. అప్పటి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రతిపాదనలతో అధికారులు గోదావరి వద్ద ప్రాథమికంగా సర్వే నిర్వహించారు. అయితే రాష్ట్రంలోని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వివాదాస్పదమైన వ్యవహారం చిన్న కొల్వాయి, కమ్మునూరు బ్యారేజీ నిర్మాణాల అంశంపై ప్రభావం చూపిందని నీటిపారుదల శాఖ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో గోదావరిపై బ్యారేజీ నిర్మాణాలకు ప్రభుత్వం ఆసక్తి చూపడన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పరిశీలన జరిపి గోదావరిపై బ్యారేజీల నిర్మాణాలపై దృష్టి సారించాలని, ప్రత్యేక ఏజెన్సీ ద్వారా డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయించాలని రైతులు కోరుతున్నారు.



బీర్‌పూర్ మండలం కమ్మునూరు వద్ద గోదావరి నది

క్షేత్ర స్థాయిలో ప్రాథమిక సర్వే నిర్వహించాం

-చైత్రు నాయక్, ఈఈ,
నీటిపారుదల శాఖ, జగిత్యాల జిల్లా

జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్ మండలం కమ్మునూరు, చిన్న కొల్వాయి ప్రాంతాల్లో గోదావరి నదిపై బ్యారేజీలు నిర్మించడానికి కొన్ని నెలల క్రితం ప్రాథమిక సర్వే నిర్వహించాం. సుమారు వెయ్యి కోట్ల రూపాయల అంచనాతో ఒక్కొక్కటి మూడు టీఎంసీల సామర్థ్యంతో రెండు బ్యారేజీలు నిర్మించాలని ప్రయత్నించాం. సంబంధిత సర్వే వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

తప్పిపోయిన వ్యక్తి అస్థిపంజరం గుర్తింపు

ధర్మారం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) మతిస్థిమితంలేక 2023,మేలో తప్పిపోయినవ్యక్తి అస్థిపంజరాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు.మండలంలోని తండాకే గ్రామానికి చెందిన లావుడ్య శ్రీనునాయక్ (68) 2023మే 26న, ఐకేసి సెంటర్‌కు వెళ్తన్నానని ఇంట్లో చెప్పి మతిస్థిమితం లేక తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు అతని కోసంవెతికినా ఫలితం లేకపోవడంతో కొడుకు తిరుపతినాయక్ అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం కటికెనపల్లి గ్రామశివారులోని ఊరచెరువులో ఓ ఎముకల గూడు ఉందని తిరుపతి నాయక్‌కు స్థానికులద్వారా సమాచారం అందింది. కుటుంబసభ్యులతో కలిసి కొడుకు తిరుపతి నాయక్ హుటాహుటిన వెళ్లి అస్థిపంజరాన్ని పరిశీలించగా ఎముకల గూడుపైన ఉన్న బట్టల ద్వారా అస్థిపంజరం తనతండ్రి శ్రీనునాయక్‌దేనని గుర్తుపట్టారు. అనంతరం తిరుపతినాయక్ పోలీసులకు సమాచరం ఇవ్వగా కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐతెలిపారు. రెండేళ్లతర్వాత శ్రీనునాయక్ అస్థిపంజరంలభించడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామపరిధిలో శనివారంరాత్రి జరిగిన ప్రమాదంలో ములకల ఆశాలు(48)అనే వ్యక్తి గాయపడగా ఆదివారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. పోలీసులకథనంప్రకారం.. వేములవాడ నుంచి వస్తున్న టీఎస్19హెచ్ 7488 నంబరు గల ఫ్రంట్ బ్లేడ్ ట్రాక్టర్, కారు శనివారం రాత్రి ఎదురెదురుగా ఢీకొట్టాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న ములకల ఆశాలు తీవ్రంగా గాయపడ్డాడు. ఆశాలును చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించగా ఆదివారం మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చొప్పదండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి బీసీ కాలనీలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఎస్‌ఐ సురేందర్ కథనం ప్రకారం.. బీసీకాలనీలో గాజుల కనకలక్ష్మి(55) నివాసం ఉంటుంది. భర్త మృతిచెందడంతో ఒక్కరే ఇంటిలో ఉంటుండగా ఆదివారం ఉదయం కూతురు నాగమణి కాల్ చేయగా ఫోన్ లిఫ్టు చేయలేదు. వెంటనే పక్కింటి వ్యక్తికి ఫోన్ చేసి తన తల్లిని పిలవాలని కోరింది. ఆమె ఇంటికి వెళ్లి చూడగా తలుపులు మూసి ఉన్నాయని, ఎంత పిలిచినా పలకడం లేదని చెప్పింది. వెంటనే కూతురు నాగమణి ఇంటికి వచ్చి చూసేసరికి కనకలక్ష్మి మృతిచెంది ఉంది. మెడలోని పుస్తెలతాడు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వీణవంక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తిచెంది క్రిమి సంహారక మందు తాగిన ఓ మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం కోర్కల్ గ్రామానికి చెందిన అంబాల కాంతమ్మ(59) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తిచెంది ఈనెల 11న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడచికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి భర్త అంబాల పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం..

● చికిత్స పొందుతూ మృతి

చిగురుమామిడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి లక్ష్మి(75) అనే మహిళ అనారోగ్యంతో ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్ప డినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నేళ్లుగా లక్ష్మి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఇటీవల కాలు విరిగి మంచం పట్టింది. ఇబ్బందులు తాళలేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పక్కింట్లో ఉంటున్న కొడుకు వెంటనే ఆమెను చికిత్స నిమ్మిత్తం కరీంనగర్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ ఆమె అక్కడ మృతి చెందింది. మృతురాలి కూమారుడు తమ్మిశెట్టి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బలవన్మరణం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన వివాహిత శ్యాగసునీత(45) ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లెల్ల గ్రామానికి చెందిన శ్యాగ దేవయ్య, సునీత కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. దేవయ్య వంటలు వండుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో దేవయ్య వంటలు చేయడానికి పంజాబ్ రాష్ట్రానికి వలస వెళ్లాడు. భార్య సునీత కూలి పని చేసుకుంటూ పిల్లలతో జిల్లెల్ల గ్రామంలోనే ఉంటుంది. ఈ క్రమంలో సునీత అనారోగ్యం పాలవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈ నెల 10వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు అప్పటినుంచి సునీత ఆచూకీ కోసం వెతుకుతుండగా ఆదివారం గ్రామ శివారులోని వ్యవసాయ బావి పక్కన గల చెట్టుకు ఉరివేసుకొని కనిపించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్: ఒకరు మృతి



లచ్చయ్య(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్‌లో బైక్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన వేల్పుల లచ్చయ్య(49) పని నిమిత్తం బైక్‌పై అలుగునూర్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా వెనకాల నుంచి అజాగ్రత్తగా, అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లచ్చయ్య కిందపడగా తలతోపాటు పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై వివేక్ ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం, ట్రాలీ ఆటో ఢీ

రామగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికిచెందిన సంతోష్ అనేవ్యక్తి ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సంతోష్ ద్విచక్రవాహనంపై సెంటినరీకాలనీ వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో వెనకలే వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. దీంతో సంతోష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హుటాహుటిన కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

కాట్రపల్లిలో ఎలుగుబంటి హల్‌చల్

● యువకుడిపై దాడి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఆదివారం ఎలుగుబంటి హల్‌చల్ సృష్టించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన బాణాల హరీష్ అనేయువకుడు ఉదయం బహిర్భూమికి వెళ్లగా ఎలుగుబంటి అతనిపై దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన హరీష్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కొద్దిరోజులుగా ఎలుగుబంటి సంచరిస్తుందని, అటవీశాఖాధికారులకు సమాచారం ఇస్తే తుతూ మంత్రంగా వచ్చి వెళ్లారే తప్ప పట్టుకోలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, ఉపాధి పనులకు వెళ్లే మహిళలు ఉన్న దృష్ట్యా వెంటనే ఎలుగుబంటిని అధికారులు పట్టుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గాయపడిన బాణాల హరీష్

అన్నారంలో గ్రామరక్షక దళాల ఏర్పాటు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



అన్నారం యువకులతో మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మానకొండూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వరుస దొంగతనాలతో వణికిపోతున్న అన్నారం గ్రామస్థులు అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్పందించారు. దొంగతనాల నివారణకు గ్రామంలో గ్రామ రక్షకదళాలను ఏర్పాటు చేయాలని స్థానికసీఐ లక్ష్మీనారాయణను ఆదేశించారు. దీంతో సీఐ అన్నారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో గ్రామయువకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో దొంగతనాలను నివారించడానికి మన ఊరు- మన సంరక్షణ అనే కార్యక్రమాన్ని పోలీసుశాఖ ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి గ్రామంలో 18ఏళ్లు నిండిన యువకులు స్వచ్ఛందంగా గ్రామ వలీంటరుగా పనిచేస్తానని ముందుకురావాలని సూచించారు. వారికి టార్చ్‌లైట్లు, కర్రలు, ఐడీ కార్డులను అందజేస్తామన్నారు. ప్రతిరోజు నలుగురు చొప్పున గస్తీ తిరిగినప్పుడు కొత్త వ్యక్తులు తారసపడితే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. వలీంటర్‌గా పని చేసే వారికి ప్రయివేటు ఉద్యోగాలలో అవకాశం లభించేలా చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

బోయినపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయపనులు ముగించు కొని ఇంటికివస్తున్న ఓరైతు రోడ్డుప్రమాదంలో గాయపడిచికిత్స పొందుతూ మృతిచెందాడు. బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికిచెందిన ఎర్ర హనుమంతు (68) ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకువెళ్లి తిరిగి ఇంటికివస్తున్నాడు. నీలోజిపల్లి సమీపాన హైవేనుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా వేములవాడ వైపునుంచివస్తున్న కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో హనుమంతు తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులు ఆపాలి

● ఆదివాసీ హక్కుల నేత మల్లన్న



బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

మంథని, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆదివాసీలపై జరుగుతున్న దాడులు ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఈనెల20న కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించే బహిరంగ సభ కరపత్రాలను ఆదివారం స్థానికప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ.. అడవుల్లోని కోట్లాది అటవీ, ఖనిజా సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తోందన్నారు. వీటికి వ్యతిరేకంగా ఆదివాసీలంతా ఉద్యమించాలని కోరారు. సభకు వక్తలుగా ఎస్ వేణుగోపాల్, పాశంయాదగిరి, గడ్డంలక్ష్మణ్, కూనంనేని సాంబశివ రావు, నారాయణరావు, గుమ్మడి నర్సయ్య, కట్ట విశ్వనాథ్, మర్రి వెంకటస్వామి హాజరవుతారని తెలిపారు. అధికసంఖ్యలో ప్రజాస్వామికవాదులు, మేధావులు, రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థి, యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక నాయకులు గుమ్మడి కొమురయ్య, రామిళ్ళ బాపు, ఎరుకల రాజన్న, పొన్నం రాయమల్లు, యాదన్న, చందులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వరుస సెలవులతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వేములవాడకు తరలివచ్చారు. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులకు సుమారు మూడు గంటల సమయం పట్టింది. ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు.

రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు..

రాజరాజేశ్వర స్వామివారిని ఆదివారం దేవదాయశాఖఅడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు దర్శించుకున్నారు. రాజన్నఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు ఘనస్వాగతం పలికారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని స్వామివారి ప్రత్యేకపూజలో పాల్గొనగా అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయాధికారులు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కాగా బీఆర్ఎస్ సీనియర్‌నేత, ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి కుటుంబసభ్యులతోకలిసి రాజన్నను దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం గావించి ప్రసాదం అందజేశారు.

బాలుడి ప్రాణం తీసిన దారి వివాదం

● చికిత్స పొందుతూ మూడేళ్ల బాలుడి మృతి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో దారి వివాదం ఓ బాలుడి ప్రాణం తీసింది. ఈ నెల 8న కత్తిపోట్లకు గురైన సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కళికోట శివ నేత్ర(3) అనే బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కలికోట వెంకటేశ్ అనే వ్యక్తికి తన అన్న శ్రీనివాస్ కుమారుడు పృథ్వీకి కొన్ని రోజులుగా దారి వివాదం ఉంది. దీంతో పృథ్వీ మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి వెంకటేశ్ కటుంబంపై కత్తులతో దాడి చేయగా మూడేళ్ల బాలుడు శివనేత్ర తీవ్రంగా గాయపడ్డాడు. నిండు గర్భిణీఅయిన ఏంజెల్, వెంకటేశ్‌లకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన శివనేత్ర స్థానిక ఆసుపత్రిలో ఏడుగురు వైద్యులు చికిత్స చేసి పరిస్థితి విషమించడంతో మెగరుగైన వైద్యం కోసం కరీంనగర్ నుంచి హైద్రాబాద్‌కు తరలించగా అయిదు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో కుటుంబంలో విషాధం నెలకొంది. ఈ కేసులో ఇప్పటికే హత్యాయత్నానికి పాల్పడిన పృథ్వీతో పాటు ఆరుగురు కటకటాలపాలయ్యారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మల్లాపూర్ గ్రామ శివారులో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. గ్రామ శివారులో వ్యవసాయ పొలాల వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు నిర్వహించి రూ.4,500 నగదు, 4 సెల్‌ఫోన్లు, 2 రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మామిడి పంటకు తెగుళ్లు

● వరుసగా నాలుగో యేడు నష్టం
● సమస్యల్లో రైతులు



మామిడి తోట

చొప్పదండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలకు తెగుళ్ల బెడద తగ్గడం లేదు. వరుసగా నాల్గవ సంవత్సరం కూడా తోటలన్నీ తెగుళ్లబారినపడి రైతులకు నష్టాలు మిగులుస్తున్నాయి. తెగుళ్ల నివారణకు అనేకరకాల క్రిమిసంహారక మందులను పిచికారి చేసినప్పటికీ ఫలితం లేకపోగా, పంట నష్టపోతున్నారు. పెట్టినపెట్టుబడి కూడా రాకపోవడంతో మామిడి రైతులు సమస్యల వలయంలో చిక్కుకున్నారు. ఈసారి కూడా దిగుబడి రాకపోగా మంచిధర పలుకుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● తేనె మంచు పురుగు ఉధృతి..

కొన్నేళ్లుగా మామిడి తోటలకు తేనె మంచు పురుగు ఉధృతి వస్తోంది. పురుగులలో రోగ నిరోధక శక్తి పెరగడంతో రసాయనాలకు కట్టడి కావడంలేదని రైతులు చెబుతున్నారు. వీటికి తోడు బూడిద తెగులు, పండు ఈగ, మంగు తెగులు మామిడి తోటలకు సోకుతున్నాయి. వీటి బారిన పడిన మామిడి పండ్లు నాణ్యత లేకుండాపోయి, మార్కెట్‌లో కొనేవారు కరువైపోతున్నారని రైతులు చెబుతున్నారు. తేనె మంచు పురుగు సోకిన మామిడి కాయలు చెట్టునుంచి కోసిన తర్వాత పాడైపోతుండడంతో కొనుగోలుదారులు గతేడాది విముఖత చూపించారు. ఫలితంగా గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోయారు.

● పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి..

తెగుళ్లను అరికట్టేందుకు రైతులు ఈసారి రసాయనాల కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడి బాగా పెరిగిపోయింది. ఇదే సమయంలో దిగుబడి తగ్గిపోయింది. పూత రాలిపోగా వచ్చిన కాయలకు పురుగుల తాకిడితో నాణ్యత కోల్పోయి ధర పలకడం లేదని రైతులు ఆవేదని వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు సరైన సస్య రక్షణ చర్యలు చేపట్టడంతో మామిడికాయ నాణ్యత పెరిగి మంచి ధర పలుకుతోంది. కాగా దిగుబడి తగ్గడంతో మామిడి కాయల కోసం నాగ్‌పూర్ నుంచి కొనుగోలుదారులు రంగంలోకి దిగారు. మామిడితోటల వద్దకు వచ్చి బేరసారాలు చేస్తున్నారు. టన్ను మామిడికి నాణ్యతను బట్టి 20వేల నుంచి లక్ష రూపాయల వరకు చెల్లించేందుకు వ్యాపారులు ముందుకు వస్తున్నారు. మామిడి దిగుబడి తగ్గగా ధరపైకి పోతోందన్నారు. కాగా వరుసగా నాల్గవ ఈ సంవత్సరం పెట్టుబడి కూడా నష్టపోయామని రైతులు చెబుతున్నారు.

ప్రజాధనం నీళ్ల పాలు

- మిషన్ భగీరథ రాకతో రెండు ప్రాజెక్టులను పట్టించుకోని అధికారులు
- తుప్పు పడుతున్న మోటార్లు

గంగాధర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు రక్షిత నీరందించాలని పదేళ్ల క్రితం 12.20 కోట్లతో ప్రాజెక్టును ప్రారంభించారు. మిషన్ భగీరథ పథకం వచ్చిందని 36 గ్రామాలకు రక్షిత శుద్ధ జలాన్ని అందించిన ప్రాజెక్టును అధికారులు మూలన పడేశారు. 17 కోట్లతో నిర్మించిన మరో శుద్ధ నీటి ప్రాజెక్టు ట్రయల్‌రన్ చేయకముందే వదిలేశారు. లక్షల రూపాయాల విలువైన పెద్ద పెద్ద మోటార్లు తుప్పు పట్టిపోతున్నాయి. మరికొంత సామగ్రి దొంగల పాలవుతోంది. ప్రాజెక్టు పరిసర ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గంగాధర మండల కేంద్రంలోని ఎల్లమ్మ చెరువులో 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో నీటిని శుద్ధి చేసేందుకు 60 ఫీట్ల పొడవు, 15 ఫీట్ల వెడల్పుతో నాలుగు బెడ్లను నిర్మించారు. ఫిల్టర్ బెడ్లకు నీటిని పంపింగ్ చేయడానికి చెరువులో చెక్ వెల్ నిర్మించి 20 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న మూడు పంపులను ఏర్పాటు చేశారు. ఇందులో రెండు నడిపిస్తుంటే ఒకటి స్టాండ్ బైగా ఉంటుంది. శుద్ధి చేసిన నీటిని మూడు లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు సంపుల్లోకి పంపిస్తారు. సంపుల్లో 75 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న రెండు పంపులతో ఎల్లమ్మ గుట్టపై నిర్మించిన 1.5 లక్షల ఓహెచ్ఆర్ ట్యాంకులోకి ఎక్కిస్తారు. ఈ ట్యాంకు నుంచి గంగాధర మండలం 33 గ్రామాలతో పాటు పెగడపల్లి మండలం ఐతుపల్లి, నందగిరి, తిర్మలాపూర్ గ్రామాలకు మంచి నీటిని సరఫరా చేస్తారు. ఇదంతా తొమ్మిదేళ్ల క్రితం నాటి శుద్ధ నీటి పథకంతో ఆయా గ్రామాల్లో మంచినీటిని తాగామని ప్రజలు చెప్పుతున్న మాట.



75 హెచ్‌పీ మోటార్లున్న సంపులు

● ట్రయల్ రన్ చేయకుండానే..

17 కోట్ల ప్రాజెక్టు ట్రయల్ రన్ చేయకుండానే మూసేశారు. కొడిమ్యాల మండలానికి ఎల్లమ్మ చెరువు నుంచి రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో ఆర్ఎస్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం పనులు పూర్తయినా ట్రయల్ రన్ చేయకుండానే వృథాగా వదిలేశారు. వెరసి జాక్‌వెల్‌లో 15 హెచ్‌పీ సామర్థ్యమున్న మోటర్లు నీటిలోనే తుప్పు పడుతున్నాయి. సంపుల్లో 40 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న మూడు మోటర్లు ఉన్నాయో.. లేవో తెలియదని స్థానిక ప్రజలంటున్నారు. నాలుగు ఎంఎల్‌డీ ఫిల్టర్ బెడ్లు పనికి రాకుండా పోయాయి. 60 వేల ఓహెచ్‌బీఆర్ సామర్థ్యం ఉన్న ట్యాంకు వృథాగా ఉంది. ఇక్కడి నుంచి పంపింగ్ చేసి కొడిమ్యాల మండలం చెప్యాలలోని సంపులో నీటిని పోయిస్తారు. అక్కడి నుంచి కొడిమ్యాల మండలంలోని అన్ని గ్రామాలకు నీటిని సరఫరా చేయాలని ప్రణాళిక సిద్ధం చేసి చెప్యాలలో ఒక సంపు, మోటార్, వాచ్‌మన్ గది, ఓహెచ్‌బీఆర్ ట్యాంకు నిర్మించి వదిలేశారు. మిషన్ భగీరథ పథకం ప్రారంభంతో 17 కోట్ల ప్రాజెక్టు కనీసం ట్రయల్ రన్ కాకముందే మూసేశారు. దీంతో ఎంతో ఉపయోగకరంగా అధికారులు నిర్ణయించి ప్రజాధనంతో చేపట్టిన ప్రాజెక్టు నిధులు నీళ్ల పాలయ్యాయని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల రక్షిత నీటి శాఖ అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలించినట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రాజెక్టును అధికారులు పరిశీలించి పనికి వచ్చే యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన వెంకటయ్యపల్లి స్కీం

● విలువైన సామగ్రి దొంగలపాలు

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. దీంతో 12.2 కోట్ల ప్రాజెక్టును పట్టించుకోలేదు. విలువైన పెద్ద పెద్ద మోటార్లు తుప్పుపట్టిపోతున్నా యి. 75 హెచ్‌పీ, 20 హెచ్‌పీ సామర్థ్యం మోటర్లు పదేళ్లుగా పట్టించుకోక పోవడంతో తుప్పు పట్టిపోయాయి. ఇక్కడ నిర్మించిన రూంల్లోని ఫ్యాన్లు, ఫర్నీ చర్, తలుపులు, ప్రాజెక్టుకు ఉపయోగించిన విద్యుత్ మోటార్లు, విలువైన వైర్లు దొంగలు ఎత్తుకు పోయారు.



దొంగలు ఎత్తుకెళ్లిన తలుపులు



● సమ్మర్ స్పెషల్..

వేసవితాపానికి చెక్..

● దోసకాయతో బహుళ ప్రయోజనాలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 13: ఎండలు ముదురుతున్నాయి. ఎండల్లో తిరిగి వచ్చాక శరీరం నీరసంగా ఉంటుంది. దోసకాయ తింటే శరీరానికి చలువ చేస్తుంది. దోసకాయల్లో కీరదోస, కూరదోస రెండు రకాలు ఉన్నాయి. దోసకాయలు ఫ్రీ రాడికల్‌లను శుభ్రపర్చుకోవడానికి, రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతాయి. విటమిన్ సీ, బీటా కెరోటిన్, మాంగనీస్ ఉన్న దోసకాయలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. దోసకాయల్లో విటమిన్‌ఏ, విటమిన్ బీ12, విటమిన్ బీ6, విటమిన్ సీ, విటమిన్ కె అధికంగా ఉంటాయి. క్యాన్సర్ నిరోధకంగా ఉపయోగపడుతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారించడంతో పాటు రక్త పోటును నియంత్రిస్తాయి. జీర్ణ వ్యవస్థను మెరుగు పరిచి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. బరువు తగ్గడానికి సహాయ పడుతాయి. దోసకాయలు తింటే 80 పోషక పదార్థాలు మన శరీరానికి లభిస్తాయి.

వేములవాడలో సైట్ మ్యూజియం ఏర్పాటు చేయాలి

- ప్రముఖ పురావస్తు పరిశోధకుడు డాక్టర్ శివనాగిరెడ్డి
- శ్రీ భీమేశ్వరాలయంలోని శిల్పాల పరిశీలన



భీమేశ్వర ఆలయంలో శిల్పాలను, శిలాశాసనాలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో సైట్ మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త డాక్టర్ శివనాగిరెడ్డి అన్నారు. రాజన్న అనుబంధ ఆలయామైన శ్రీభీమేశ్వరస్వామి వారి ఆలయంలోని శిల్పాలను ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో 9,10వ శతాబ్దానికి చెందిన అపురాప జైన, బద్ధ, హిందూ శిల్పాలను పదిలపరచాలని, వాటిన్నంటినీ శుభ్రపరిచి సైట్ మ్యూజియం ఏర్పాటు చేసి సందర్శకులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భీమేశ్వర ఆలయంలోని దక్షిణ భాగాన తోటలో ఒక మూలన జైన, బౌద్ధ, హిందూ శిల్పాలు, సప్తమాతృకలు, దేవీ శిల్పాలు, శివలింగాలను నిరుపయోగంగా పడేశారని, వాటి ఆలనాపాలనా లేక చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. భీమేశ్వర ఆలయం ముందు గణపతి విగ్రహం, ఒక శిలాశాసనం ఉందని, వాటిని పరిశీలించినట్లు చెప్పారు. శిల్పాలు సుమారు వెయ్యి నుంచి పన్నెండు వందల సంవత్సరాల వయస్సుగలవని, అపురూపమైన శిల్పాలని అన్నారు. శ్రీకేదారేశ్వరాలయం కుంగిపోయిందని, పురావస్తు శాఖ వారితో పునరుద్ధరించాలని సూచించారు. వేములవాడ ఆలయానికి సుమారుగా 15వందల చరిత్ర ఉందని అన్నారు. ఈ బృందంలో ప్రముఖదేవాలయాల స్థపతి సుధాకర్ సింగ్, నాగేంద్రశర్మ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



వంశీ (ఫైల్)

మెట్‌పల్లిరూరల్, ఏప్రిల్, 13 (ఆంధ్ర జ్యోతి): పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మెట్‌పల్లి రూరల్ మండలం వేంపేట గ్రామానికి చెందిన గట్లవంశీ(24) అనే యువకుడు ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. బంధువులు, గ్రామస్థులుతెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గట్ల సత్యంకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన గట్టవంశీ గోదావరిఖనిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల6న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్నేహితులు గమనించి ఆసుపత్రికి తరలించగా నిజామాబాద్‌లోని ఓప్రైవేట్‌ఆసుపత్రిలో ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి మృతి

పెద్దపల్లి రూరల్ , ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండలం కొలనూర్ గ్రామానికిచెందిన సింగరేణిరిటైర్డ్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెద్దపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొలనూర్‌కుచెందిన సింగరేణిరిటైర్డ్‌కార్మికుడు గడబోయిన మొండయ్య (69) ద్విచక్రవాహనంపై ఏప్రిల్7న పెద్దపల్లికి వస్తుండగా పెద్దబొంకూర్‌శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి గాయాలపాలయ్యాడు. అతన్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి మెరుగైనవైద్యం కోసం కరీంనగర్, అక్కడినుంచి హైదరబాద్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భార్య శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

అకాల వర్షం..తడిసిన ధాన్యం



రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అకాల వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన వరిధాన్యం వర్షంతో తడిసి ముద్దయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. - రాయికల్

మరమ్మతుకు నోచుకోని చేతిపంపు

మానకొండూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో చేతిపంపు చెడిపోయి మూడునెలలు దాటినా మరమ్మతులకు నోచుకోవడం లేదు. వేసవి ప్రారంభంలోనే చేతిపంపు చెడిపోవడంతో గ్రామస్థులు నీటికి నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా నీటిసరఫరా సక్రమంగా జరగడం లేదని చేతి పంపులపైనే ఆధారాపడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. మూడు నెలలుగా చేతిపంపు చెడిపోయిందని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చేతిపంపు మరమ్మతు చేపట్టి దాహార్తిని తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అన్నారంలో మరమ్మతుకు నోచుకోని చేతిపంపు

వేములవాడలో కలకలం

- యువకుడి దారుణ హత్య
- వైరల్‌గా మారిన వీడియోలు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైనట్లు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి అనుసంధాన గ్రామమైన పోచెట్టిపల్లి గ్రామానికి చెందిన చెట్టిపల్లి పర్శరాములు(37) అనే యువకుడు పట్టణంలోని కోనాయపల్లి శివారులో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఓ వ్యక్తి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్ ఫంక్షన్‌హాల్ వంటగది పైఅంతస్తులో పర్శరాములును దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పోలీస్ బృందంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడు పర్శరాములుకు భార్య కల్యాణి, కూతురు, కుమారుడు ఉన్నారు. పర్శరాములతో సంబంధం వున్న ముగ్గురు వ్యక్తులు సోషల్ మీడియాలో రక్తపు మరకలు ఉన్న రెండు గొడ్డళ్లు, ఒక కత్తితో మా జోలికి వస్తే ఇట్లుంటది అంటూ హెచ్చరించినట్లు వీడియోలో ఉంది.

గంజాయి స్మగ్లింగే ప్రాణం తీసిందా?

పర్శరాములుకు గంజాయి అమ్మే వ్యక్తులతో పరిచయాలు ఉన్నాయని, అతను కూడా గంజాయి చాటుగా విక్రయిస్తాడని వేములవాడ పట్టణంలో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే వారి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయని, ఆ గొడవలు హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. పర్శరాములు నిజంగానే గంజాయి స్మగ్లింగ్ చేస్తాడా, లేక గంజాయి స్మగ్లింగ్ చేసే వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయా, లేకుంటే హత్యకు మరేదైనా కారణం ఉందా అని పోలీసులు విచారణ చేపట్టారు.



చెట్టిపల్లి పర్శరాములు (ఫైల్)

ప్రారంభమైన తునికాకు సేకరణ

- అడవుల బాట పడుతున్న గిరిజన కూలీలు
- నెల రోజుల పాటు ఉపాధి



తునికాకు కట్టలు కడుతున్న గిరిజనులు

రుద్రంగి ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం వేసవిలో గిరిజనులు ప్రకృతి సంపదగా భావించే తునికాకు సేకరణ పనులు ప్రారంభమయ్యాయి. రుద్రంగి మండలం లోని మానాల చుట్టూ ఉన్న గిరిజనతండాల్లోని ఆటవీపరిధిలో తునికాకు సేకరణకు వేకువజామున లేచి పిల్లలు, పెద్దలు తేడాలేకుండా ప్రతి ఒక్కరూ అడవిబాట పడుతారు. ఉదయం9 గంటల వరకు తునికాకు సేకరించి ఇళ్లకు చేరుకుంటున్నారు. అనంతరం సేకరకించిన ఆకును ఇంటి ముందు ఉన్న చెట్ల నీడలో కూర్చొని ఆకులను కట్టలుగా కడుతారు. కట్టలను కొద్ది రోజులపాటు ఆరబెడతారు. 50ఆకులు గల కట్టకు కేవలం రూ.2 ఇస్తుండటంతో కూలీ కూడా పడటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా రవాణాసౌకర్యం లేకపోవడంతో ఎడ్లబండ్లు, కాలినడకన అడవుల్లోకి వెళ్లాల్లి వస్తోంది. మరోవైపు వన్య మృగాల భయం కూలీలను వెంటాడుతోంది. గ్రామాల చుట్టుపక్కల ఉన్న బీడు భూములు వ్యవసాయ భూములుగా మారడంతో అడవుల్లోకి వెళ్లక తప్పడం లేదు. తునికాకు సేకరణకు సంబంధించి ముందస్తుగా ప్రూనింగ్ (కొమ్మ కొట్టించడం) చేయలేదు. అడవుల్లో లోనికి వెళితేగాని ఆకు దొరికే పరిస్థితి లేదు. తునికాకు సేకరణ పనులతో కూలీలకు సుమారు నెల రోజుల పాటు పని లభిస్తుంది.

● అడవిలో ఐదు, ఆరు కిలోమీటర్లు నడవాల్సి వస్తుంది

- భూక్య రేనా, గైదిగుట్ట తండా



తెల్లవారుజామునే బయల్దేరి వెళ్లి అడవిలో ఐదారు కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. కాలినడక వెళ్లడం వల్ల అలసటతో ఆకులు కోయలేక పోతున్నాం. ఉదయం 10 గంటల దాకా తెంపిన ఆకుల మూటలతో తిరిగివచ్చి ఇంటిల్లిపాది పొద్దంతా కూర్చొని ఆకులుపేర్చి కట్టలు గట్టి ఆరబెడుతున్నాం.

● శ్రమకుతగ్గ ఫలితం లేదు

- భూక్య సునీత, గైదిగుట్ట తండా



ఉదయం అడవులోకి వెళ్లికి చెట్ల వెంట తిరిగి తునికి ఆకులను సేకరిస్తున్నాం. ఎంతో శ్రమకోర్చి కట్టలు కట్టి విక్రయిస్తే 50 ఆకులు గల ఒక్కో కట్టకు రూ. 2చెల్లిస్తున్నారు. పొద్దస్తమానం కష్టపడ్డా 150 కట్టలు దాటడం లేదు. రోజువారి కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. దినమంతా పనిచేస్తే రూ. 300 కూలి వస్తుంది.

భక్త జనసంద్రంగా కొండగట్టు

- అంజన్నను దర్శించుకున్న లక్షకు పైగా భక్తులు
- ముగిసిన హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు

మల్యాల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధి భక్త జన సంద్రంగా మారింది. శుక్రవారం ప్రారంభమైన హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం అర్ధరాత్రి దాదాపు లక్ష వరకు దీక్షాపరులు కొండపైకి తరలిరావడంతో అంజన్న పరిసరాలు కిక్కిరిశాయి. రామనామంతో కొండగట్టు గిరులు పులకించిపోగా, ఆలయ పరిసరాలు కాషాయమయంగా మారాయి.



జపం చేస్తున్న భక్తులు

తండోపతండాలుగా దీక్షాపరులు తరలిరావడంతో ఘాట్‌రోడ్డు, మెట్ల మార్గం, దిగువ కొండగట్టు, దొంగలమర్రి ప్రాంతం భక్తులతో రద్దీగా మారాయి. దీక్షవిరమణ మండపంలో మాలవిరమణ చేసిన భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. కొండగట్టు అంజన్నకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు, దీక్షాపరులు తిరుగుపయనమయ్యారు. శనివారం అర్ధరాత్రి కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ ఇతర అధికారులతో పాటు ఈవో శ్రీకాంత్‌రావు, సీఐ నీలం రవి, పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.



కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తజనం

● ఉత్సవాలు విజయవంతం

కొండగట్టులో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అన్ని శాఖల అధికారుల సహకారంతో విజయవంతంగా ముగిశాయని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఎప్ప శ్రీనివాస్‌రెడ్డి, ఈవో శ్రీకాంత్‌రావు వేర్వేరుగా తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉత్సవాలకు రెండు లక్షలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నట్లు వారు పేర్కొన్నారు.



భక్తులు సమర్పించిన ముడుపులు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



దర్శనం ముగించుకొని తిరిగి వెళ్తున్న భక్తులు

కేటీఆర్‌వి అహంకార పూరిత మాటలు

● సుడా చైర్మన్ కొమటి రెడ్డి నరేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌వి ఆహంకార పూరిత వ్యాఖ్యలని, తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కొమటి రెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశాల పేరుతో కాంగ్రెస్ పార్టీపైనా, సీఎం రేవంత్ రెడ్డిపైనా కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ గొప్పతనాన్ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గేను ఓటు ద్వారా ఎన్నుకున్నట్లు, పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్‌ను నియమించుకున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్‌లో అధ్యక్షుడు, కార్య నిర్వాహక అధ్యక్షుడు తండ్రీ కొడుకులేనన్నారు. కేటీఆర్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఒక వైపు కొప్పుల ఈశ్వర్, ఇంకో వైపు గంగుల కమలాకర్ కూర్చున్నారని, వారిలో ఒక్కరికైనా అధ్యక్ష లేదా కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇవ్వచ్చు కదా అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క పిల్లర్‌కు చిన్న పర్రె మాత్రమే వచ్చిందంటూ సమర్థించుకోవడం సిగ్గు చేటన్నారు. పిల్లర్ ఏవిధంగా కుంగిందో? ఎన్ని పిల్లర్లు దెబ్బతిన్నాయో ప్రజలకు తెలుసన్నారు. మూసి రివర్‌ను రూ.1100 కోట్లతో శుద్ధి చేయవచ్చని అనడం విడ్డూరంగా ఉందన్నారు. కేటీఆర్ ఆహంకార మాటలు మానుకోకపోతే బుద్ధి చెప్పే రోజు వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రవణ్ నాయక్, దన్న సింగ్, రవీందర్ గౌడ్, కర్ర పోచయ్య, తమ్మడిఎల్లా, మాసుం ఖాన్, మహమ్మద్ భారీ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

జార్జిరెడ్డికి నివాళి

భగత్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా పీడీ ఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులు కార్యక్రమంలో రాహుల్ సాయి కిషోర్, తిరుపతి, అనిల్, మధూకర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మానేరు వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు వాకర్స్ శ్రీబృందా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మానేరు డ్యాం కట్టపై వాకర్లకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఒల్లాల శ్రావణ్ కుమార్, సుమా భార్గవి, మేనేజింగ్ డైరెక్టర్ ఒల్లాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కార్యక్రమం

కరీంనగర్ కల్చరల్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, మెలోడి లవర్స్ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కళాభారతిలో ఈద్ మిలాప్ సెలబరేషన్ పేరిట నిర్వహించిన లైవ్ మెలోడియస్ నైట్ విత్ స్టార్ వాయిసెస్ కార్యక్రమం అలరించింది. రెండు సెషన్స్‌లో కళాకారులు పాటలతో మంత్ర ముగ్ధుల్ని చేశారు. మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహేర్ బిన్ అందాన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలకు బీజేపీ విఘాతం

భగత్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయాలకు బీజేపీ విఘాతం కలిగిస్తున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. ఆదివారం నగరంలో సీఐటీయూ సామాజిక న్యాయ సాధన బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రభుత్వ సంస్థలను, రిజర్వే షన్లను, కార్మిక చట్టాలను రక్షించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

విలీన గ్రామాల్లో మారని బోర్డులు

● సమస్యలు విన్నవించేందుకు గ్రామస్థుల ఇక్కట్లు



దుర్శేడ్‌లో మార్చని బోర్డు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీన గ్రామాల ప్రజలు సమస్యలు ఎదురైతే ఎవరికి విన్నవించాలో తెలియక అవస్థలు పడుతున్నారు. మూడు నెలల కిందట కరీంనగర్ మండలంలోని దుర్శేడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్ గ్రామాలను విలీనం చేశారు. పంచాయతీ భవనాలను వార్డులుగా మార్పు చేశారు. పంచాయతీ పరిచయ వేదిక బోర్డులను మాత్రం తొలగించలేదు. పంచాతీలుగా ఉన్న సమయంలో ఎలాంటి అవసరం ఉన్నా బోర్డులో నంబర్లలో అధికారులకు ఫోన్ చేసి సమస్యలను విన్నవించే వారు. ఇప్పుడు కార్పొరేషన్‌లో ఏ అధికారికి ఏ సమస్య చెప్పాలో విలీన గ్రామాల ప్రజలకు అర్థంకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక అధికారులు ఎవరో తెలియక అయోమయానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, నగరపాలక సంస్థలో పని చేసే అధికారుల వివరాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిలిచిన డ్రెయినేజీ నీరు



ఈదులగట్టెపల్లిలో నిలిచిన నీరు

మానకొండూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదులగట్టెపల్లిలో మురికి కాల్వలో నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మురికి కాల్వలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. గ్రామపంచాయతీ ఎదుట డ్రెయినేజీ నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యపాలు అవుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మురికి కాలువలో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విగ్రహాల ముసుగులు తొలగేనా?

తిమ్మాపూర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ స్థలంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల ముసుగు తొలగేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దీక్షాపరులకు హామీ ఇచ్చి దీక్షను విరమింపజేశారు. రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లైంది.

అంజన్న స్వాములకు అన్నప్రసాదం

భగత్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ స్వాములకు నాలుగో రోజు ఆదివారం అన్నప్రసాదం వితరణ నిర్వహించారు. కొత్తపల్లిలోని జయపాల్‌రెడ్డి ఫామ్ హౌస్‌లో చల్ల హరిశంకర్ అన్నదాతగా వ్యవహరించారు. గురుస్వామి డి.సంపత్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని స్వాములకు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యా బాల భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు చింతల రమేష్, మల్లేశం చారి, గొల్ల రవి, రాజ్‌కుమార్, శ్రీను విజయ్, పొరండ్ల శ్రీను నాయక్, కొమురయ్య, తీగలగుట్టపల్లి శ్రీను, రాగంపేట శ్రీనివాస్, సాగర్ పాల్గొన్నారు.

రచయిత్రి వసంతకు అంబేద్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పత్తెం వసంత

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన రచయిత్రి, ఉపాధ్యాయిని పత్తెం వసంత ఆదివారం గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల సమావేశ మందిరంలో సౌతెర్న్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గుంటూరు, కృష్ణా నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎస్‌పీఎల్‌టీఓ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగయ్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్‌మోసిస్, రాణిశ్రీ, అమృతవర్షిణి పాల్గొన్నారు.

రాజ్యాంగం, సమన్యాయం ప్రజలకు అంబేద్కర్ వరం



నివాళులు అర్పిస్తున్న అధ్యాపక సంఘం సభ్యులు

గణేష్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, సమన్యాయం ప్రజలకు అంబేద్కర్ అందించిన వరమని టీజీసీటీఏ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సురేందర్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని డాక్టర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కరీంనగర్ ప్రాంతీయ సమన్వయ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికారత వారోత్సవాల్లో మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తిని అందిపుచ్చుకొని భారత పౌరులుగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కేంద్ర సమన్వయకులు డాక్టర్ వంగల శ్రీనివాస్, కె.రామచంద్రం, కౌన్సిలర్లు డాక్టర్ పరుశురామ్, డాక్టర్ వి.వరప్రసాద్, డాక్టర్ అలీఖాన్, రమేష్, అనిత, కొమురయ్య, శివకుమార్, డాక్టర్ రాజేశ్వర్, మహదేవ్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద కళాశాలలో మేనేజ్‌మెంట్ సదస్సు

గణేష్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ సదస్సును ఆదివారం నగరంలోని ఈఎన్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శాతవాహన విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎన్‌వీ రంగప్రసాద్ మాట్లాడారు. విషయపరిజ్ఞానం, నాయకత్వం వినూత్న ఆలోచనలు, సహకార లక్షణాలు అభివృద్ధి చెందాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా నిర్వహించే ఈ సదస్సులో నూతన అంశాలను జోడించి విద్యార్థులకు విస్తృత పరిజ్ఞానం అందిస్తున్నామన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపాదరావు వర్ధంతి



నివాళి అర్పిస్తున్న సుడా చైర్మన్, కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత, మాజీ శాసన సభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శ్రీపారావు చిత్ర పటానికి మాజీ శాసన సభ్యుడు కటకం మృత్యుంజయం, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, మాజీ శాసన సభ్యుడు ఆరపెల్లి మోహన్ నివాళులర్పించారు. అనంతరం నగరంలో శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా బైసాఖీ వేడుక



పూజలు నిర్వహిస్తున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ కల్చరల్/భగత్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురుద్వారాలో సిక్కుల ఖల్సా పంథ్ 326వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బైసాఖీ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యే క ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పూజలు చేశారు. ఆయనకు సిక్కు మత స్తులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. గురుద్వారా ప్రబంధ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సర్దుల్‌సింగ్, భిషన్ సింగ్‌లతో పాటు బల్‌బీర్‌సింగ్, రణబీర్‌సింగ్ బల్‌బీర్ సింగ్‌బల్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ పోలీస్ మీట్‌కు ఎంపికైన ఆకుల స్వప్న



స్వప్న

జమ్మికుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కేరళలోని కొచ్చిలో జరుగుతున్న ఆల్‌ఇండియా పోలీస్ టేబుల్‌టెన్నిస్ టోర్నమెంట్‌కు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని మహిళాపోలీస్‌స్టేషన్లో పని చేస్తున్న జమ్మికుంట పట్టణం మోత్కులగూడెం గ్రామానికిచెందిన ఆకుల స్వప్న ఎంపికైంది. ఈనెల11 నుంచి 15వరకు జరుగుతున్న ఈ పోటీల్లో టేబుల్‌టెన్నిస్ విభాగంలో రాష్ట్రం తరుపున వెళ్తున్న క్రీడాబృంద సభ్యురాలిగా ఆమె పాల్గొంటుంది. స్వప్న ఎంపికపట్ల గ్రామస్థులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు

గన్నేరువరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ము కుంటున్నారు. అకాల వర్షాలతో తమ ధాన్యం ఎక్కడ నీటిపాలు అవుతుందోనన్న ఆందోళనలో రైతులు రూ.1750కే ప్రైవేట్ వ్యక్తులకు తమధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు వేలం పాట

గన్నేరువరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేటలో మానసాదేవి ఆలయంలో భక్తులు సమర్పించిన ఓడిబియ్యం, చీరలు, కనుములు తదితర సామగ్రికి సోమవారం ఒక ఏడాదికి బహిరంగ వేలం పాటను నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనేవారు యాభై వేల నగదును ముందుగా చెల్లించాలన్నారు. టెండర్ దక్కించు కున్న వారు సగం డబ్బులను అదేరోజు చెల్లించాలని సూచిం చారు. ఆలయ నియమ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు.

బీసీ ఆజాది సత్యాగ్రహ దీక్ష

శంకరపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బీసీ ఆజాది ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది రాష్ట్ర అధికార ప్రతినిధి అభిలాష్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ బీసీల 42శాతం బిల్లు పార్లమెంట్ ప్రవేశపెట్టాలని ఢిల్లీలో జక్కని సంజయ్‌కుమార్ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఈ దీక్ష చేపట్టామన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాశుద్ధి

హుజూరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేటలో బీజేపీనాయకులు అంబేద్కర్ అంబేద్కర్ విగ్రహంచుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ సోమవారం అంబేద్కర్ జయంతిని వాడవాడలా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తూర్పాటి రాజు, సదయ్య, రాజు, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వీణవంక/చిగురుమామిడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలబాక, గంగారం గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ మావురపు విజయ భాస్కర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ధాన్యం ఏ గ్రేడ్ రూ.2320, కామన్ రకం రూ.2300 మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. చిగురుమామిడి మండల వ్యాప్తంగా 21వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆదివారం తహసీల్దార్ ముద్దసాని రమేష్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్థులు

రామడుగు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సంజీవని హాస్పిటల్, సంజీవని చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరాగా వైద్యులు రవికాంత్, సంధ్య, నివేదిత, నాగరాజు ఆధ్వర్యంలో షుగర్, రక్త, మూత్ర, ఈసీజీపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు, గ్రామ మాజీసర్పంచ్ కర్ర సత్యప్రసన్న శిబిరాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

గన్నేరువరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గన్నేరువరం నుంచి చొక్కారావుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డు ఇరుకుగా ఉంటుంది. నిత్యం వాహనదారులు, రైతులు వెళుతుంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌లను ఢీకొట్టే ప్రమాదం ఉంది. పశువులకు సైతం ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయాలని గన్నేరువరం, చొక్కారావుపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చంద్ర రథోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఇల్లందకుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చంద్ర రథోత్సవ(పెద్దరథం) ఏర్పాట్లను ఉదయం ఆలయచైర్మన్ ఇంగిలే రామారావు పరిశీలించారు.

ప్రాణదాతలుగా నిలవాలి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తందానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సీఐ తిరుమల్‌గౌడ్ అన్నారు. మండలంలోని కందుగులలో సచిన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు అసోసియేషన్ బాధ్యులు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

నేడు మా భూమి రథయాత్ర

హుజూరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 14న ధర్మసమాజ్‌పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజు ప్రారంభించే మాభూమి రథయాత్రను విజయవంతం చేయాలని డీఎస్పీ మండల కన్వీనర్ మంద రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంటీఎస్ డివిజన్ కార్యదర్శిగా ఓరుగంటి విష్ణువర్ధన్

చొప్పదండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) అనుబంధ భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పోస్టుమాన్, ఎంటీఎస్ కరీంనగర్ డివిజన్ కార్యదర్శిగా ఓరుగంటి విష్ణువర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం ఎన్నికలు నిర్వహించారు.

చలివేంద్రం ఏర్పాటు

జమ్మికుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట గాంధీ చౌరస్తాలో పట్టణ, పరిసరప్రాంత ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు నిత్యయోగ సాధనసెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీపీ మండల్ వర్ధంతి

హుజూరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీహార్ మాజీముఖ్యమంత్రి బీపీ మండల్ వర్ధంతిని హుజూరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హుజూరాబాద్ లారీ అసోసియేషన్ కార్యవర్గం

హుజూరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ లారీ అసోసియేషన్ కార్యవర్గం సుద్దాల హరిశంకర్, సజ్జు, బషీర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా కె రాజయ్య, ఉపాధ్యక్షుడు ఎండీ అహ్మద్, సెక్రెటరీగా ఎండీ మాజీద్, జాయింట్ సెక్రెటరీగా సయ్యద్ మునీర్, క్యాషియర్‌గా ఎం జనార్దన్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన సభ్యులను సన్మానించారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

గన్నేరువరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం, సాంబయపల్లి గ్రామాల్లో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్‌లో భాగంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పాదయాత్రను నిర్వహిం చారు. ఇంటింటికి తిరిగి రాజ్యాంగం కల్పించిన హక్కులను, విధులను ప్రచారం చేశారు.

గావ్ చలో.. బస్తీ చలో.. అభియాన్ కార్యక్రమం

రామడుగు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): : మండలంలోని షానగర్‌లోని ఎస్సీ కాలనీలో బీజేపీ నాయకులు గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అల్ఫోర్స్‌లో గ్రాడ్యుయేషన్ పట్టాల పంపిణీ

హుజూరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో అల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో ఆదివారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను చైర్మన్ నరేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తమ లక్ష్యమన్నారు.



పట్టాలు అందుకున్న విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

ఘనంగా రథోత్సవం

గంగాధర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుబూత్కూర్‌లో ఆదివారం సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై చేర్చి పండితుల వేద మంత్రోచ్చరణలతో రథోత్సవం నిర్వహించారు. రథాన్ని లాగడంలో గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రథోత్సవంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమేష్, కనుకయ్య, ప్రజలు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వీణవంక మండలం చల్లూరులో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వీణవంక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల 1995-96 పదోతరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం ఆది వారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు.

గంగాధర: గంగాధర మండలం మధురానగర్ సురభిపాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2012-13లో పాఠశాలలో చదివిన పదవ తరగతి విద్యార్థులందరూ ఒకచోట చేరి సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పినగురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాలకరస్పాండెంట్ వీరేశం, ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.